ధర.. దగా



ధరలు పతనమయ్యాయి. కష్టజీవులు దగా పడుతున్నారు. రైతులు కష్టపడి ఉల్లి, టమోటా పండించారు. నాణ్యత పేరిట వ్యాపారులు మాయ చేస్తున్నారు. క్వింటా ఉల్లి రూ.1,200లకు కొనుగోలు చేస్తామని కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. కొంతైనా పెట్టుబడి కష్టాలు తీరుతాయని అన్నదాతలు ఆనందించారు. వారం తిరక్కుండానే మేము కొనుగోలు చేయలేం అంటూ ఏపీ మార్క్‌ఫెడ్ చేతులెత్తేసింది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కర్నూలు మార్కెట్ యార్డు కూడలిలో రైతులు రోడ్డెక్కి ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- ఉల్లి, టమోటా ధరలు పతనం
- ఉల్లి కొనుగోళ్లపై చేతులెత్తేసిన ఏపీ మార్క్‌ఫెడ్
- బోనస్ ఇస్తామంటున్న అధికారులు
- క్వింటా రూ.1,200కు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- మార్కెట్‌యార్డు కూడలిలో రైతన్నల ఆందోళన

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి, టమోటా ధరలు పతనం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి మాట దేవుడెరుగు. పంట కోత, రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటూ ఏకరువు పెడుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి సాగు చేస్తున్న జిల్లాల్లో కర్నూలు అగ్రస్థానం ఉంటుంది. దేవనకొండ, సి.బెళగల్, గూడూరు, నందవరం, ఎమ్మిగనూరు, గోనేగండ్ల, ఆస్పరి, కోసిగి, ఆదోని మండలాల్లో ఉల్లి అధికంగా సాగుచేశారు. ఈ ఖరీఫ్‌లో 10,797 హెక్టర్లలో ఉల్లి పంట వేశారు. గతంలో బోరుబావుల కింద ఒక్కటే సాగు చేస్తే, ప్రస్తుతం వర్షాధారంగా కూడా సాగుచేస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు, సేద్యం, కూలీ రేట్లు పెరగడంతో పెట్టుబడి పెరిగి ఉల్లి సాగు భారంగా మారింది. దుక్కులు, పంట కోత, రవాణా కలుపుకొని ఎకరాకు రూ.85వేల నుంచి రూ.1.25లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారుల అంచనా. పెట్టుబడిపై 50 శాతం రైతుకు లాభం ఉండేలా 'కనీస మద్దతు ధర నిర్ణయించాలని జస్టిస్ స్వామినాథన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ లెక్కన క్వింటా రూ.2 వేలు పలికితేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. పంట చేతికొచ్చే సమయంలో కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు పూర్తిగా పతనం అయ్యాయి. కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడం లేదంటూ రైతులు కన్నీరు పెడుతున్నారు.

ఆరు రోజులకు చేతులెత్తేసిన మార్క్‌ఫెడ్

ఉల్లి రైతులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. మద్దతు ధర రూ.1,200 నిర్ణయించి ఆ ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చింది. కర్నూలు మార్కెట్‌యార్డులో గత ఆదివారం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200కు కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. పెట్టుబడి కష్టాలు తీరుతాయని రైతులు ఆశించారు. ఆరు రోజుల్లో 1,200 టన్నులు ఉల్లి ఏపీ మార్క్ ఫెడ్ కొనుగోలు చేసింది. 200టన్నులు ఇతర జిల్లాల్లోని రైతుబజార్లకు తరలించింది. వెయ్యి టన్నులు ఉల్లి కర్నూలు మార్కెట్‌లోనే నిలిచిపోయింది. కొనుగోలు చేసిన ఉల్లి బయటకు వెళ్లడం లేదు. దీనికి తోడు రోజుకు 3-5 వేల క్వింటాళ్ల దిగుబడులు మార్కెట్‌కు వస్తుంది. కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు ఆగిపోవడం, కొత్తగా కొనుగోలు చేసే ఉల్లి నిల్వలు ఎక్కడ ఉంచాలో తెలియని పరిస్థితి. కొనుగోలు చేయలేమంటూ ఏపీ మార్క్ ఫెడ్ అధికారులు చేతులెత్తేశారు.



బస్టాండు వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు



రోడ్డెక్కిన రైతన్నలు

ఏపీ మార్క్‌ఫెడ్ ఉల్లి కొనుగోళ్లను శనివారం ఆపేసింది. కర్నూలు మార్కెట్‌కు 4,127 క్వింటాళ్ల ఉల్లి దిగుబడలు రైతులు తీసుకొచ్చారు. కనిష్ఠంగా రూ.501లు, గరిష్ఠంగా రూ.1,249 ధర పలికితే, మధ్యస్థ ధర రూ.628 పలికిందని మార్కెట్ అధికారులు తెలిపారు.ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. మార్కెట్‌యార్డు కూడలిలో ధర్నాకు దిగారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గళమెత్తారు.

మిగతా 6వ పేజీలో

భావి తరాలకు మార్గదర్శకులుగా నిలవాలి

- కలెక్టర్ రాజకుమారి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి


నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా భావి తరాలకు మార్గదర్శ కులుగా నిలవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. నంద్యాల శ్రీ శారదా విద్యాపీఠం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన గణిత విజ్ఞానమేళా, సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మన వేదాలు, పురాణాలు మనిషి నడవడికను తీర్చిదిద్దాయన్నారు. విద్య కేవలం మార్కులు సాధించడానికే కాకుండా ఉన్నత విలువలను పెంపొందించడానికి ఉపయోగపడాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో పాటు భారతీయ విలువలను కలిపి బోధించడానికి విద్యాభారతి వంటి సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. పాఠశాల కమిటీ సభ్యులు కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రెడ్డి, సరస్వతీ విద్యాపీఠం సమితి అధ్యక్షుడు డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, ఎస్ఎండీ ఫయాజ్, విద్యాభారతి కార్యదర్శి ప్రతాప్‌సింహశాస్త్రి, సంఘటన కార్యదర్శి కన్నాభాస్కర్, పాఠశాల మేనేజర్ వసుంధరాదేవి, ప్రధానోపాధ్యాయులు వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు.. ఆందోళన వద్దు

- దుష్ప్రచారాలను నమ్మొద్దు
- రైతులకు మంత్రులు ఫరూక్, జనార్దన్‌రెడ్డి సూచన



మంత్రి బీసీ



మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్/బనగానపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎలాంటి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని న్యాయ, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. శనివారం నంద్యాలలోని పార్టీ కార్యాలంయలో ఫరూక్, బనగాపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ మాట్లాడారు. రాష్ట్రంలోని ఓ ప్రధాన పార్టీ నాయకులు యూరియా కొరత ఉందంటు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్‌కు సైతం రైతులకు అవసరమైన యూరియా సరాఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం నంద్యాలకు వచ్చిన 5వేల మెట్రిక్ టన్నులు యూరియా వచ్చినట్లు తెలిపారు. వచ్చే వారంలో మరో 4,100 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు తెలిపారు. జిల్లా ఇప్పటికే 45 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు తెలియజేశారు. మార్క్ ఫెడ్, రైతు సేవా కేంద్రాల, ప్రైవేటు డీలర్ల ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. అయితే అసత్య ప్రచారాలు చేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. అన్నదాలందరికీ యూరియా అందుతుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో మంత్రి బీసీ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో యూరియా సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. భవిష్యత్తులో ఎంత యూరియా అవసరమో నిర్దిష్ట ప్రణాళికతో రావాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వచ్చి జిల్లాలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జీఎన్ఎంలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ వైద్య విద్య డైరెక్టర్ 2025-26 విద్యా సంవత్సరానికి జీఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, నర్సింగ్ స్కూళ్లలో అడ్మిషన్లు చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అర్హతలు, వయో పరిమితి, దరఖాస్తు విధానం సీట్లు లభ్యత వంటి వివరాలు నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

బండిఆత్మకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్యులు, సిబ్బంది సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఎండీహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. శనివారం మండలంలోని కడమలకాల్వ గ్రామంలో ఆయన పర్యటించారు. వీధుల్లో ఉన్న మురుగు ఆవాసాలను, జ్వర పీడితులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో జ్వరాలు, వాంతులు, విరేచనాలు అధికం అవుతాయని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు గ్రామంలో ఇంటింటా తిరిగి ఆరోగ్య క్షేమ సమాచారం సిబ్బంది తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్, డాక్టర్ దినేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరామ్ ప్రసాద్ (నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్), రాజేశ్ (కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్), హోంగార్డు నబీసా (కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్)ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రాబరి కేసు నమోదైంది. ఓ ప్రేమ జంటను బెదిరించి వారి నుంచి దోపిడీ చేశారు. ఈ కేసులో నిందితులు నాగేంద్ర, రమేష్, మాలిక్‌బాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితులతో ఈ ముగ్గురు కానిస్టేబుళ్లు తరుచూ మాట్లాడుతుండటం, నిందితులు నేరం చేసిన విషయం తెలిసినా కూడా ఉన్నతాధికారులకు తెలపకపోవడంపై ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారిని విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యాధునిక టెక్నాలజీతో టిడ్కో గృహాలు

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ మంత్రి నారాయణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక టెక్నాలజీతో టిడ్కో గృహాలను నిర్మిస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. నగర శివారులోని టిడ్కో గృహాలను పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ బి.నవ్య, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరితో కలిసి శనివారం పరిశీలించారు. ముందుగా టిడ్కో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ సింగపూర్, మలేసియా, జపాన్, చైనా, రష్యా తదితర అభివృద్ధి చెందిన దేశాలలో షేర్ వాల్ టెక్నాలజీతో గృహాలు నిర్మిస్తారని, అదే టెక్నాలజీని వినియోగించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. సౌకర్యవంతమైన రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, కమ్యూనిటీ హాల్స్ పాఠశాల తదతర కనీస సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండు నెలల్లో మరికొన్ని చోట్ల అన్న క్యాంటీన్‌లను ప్రారంభిస్తామన్నారు. టిడ్కో సముదాయాల్లో ఉన్న కంపచెట్లను త్వరితగతిన తొలగించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబరుకల్లా 3,056 గృహాలను పూర్తి చేస్తామని, మిగతా 3,826 గృహాలు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధుల కోరిక మేరకు టిడ్కో గృహ సముదాయానికి ఒక పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తామని, అది కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా త్వరలో వస్తుందన్నారు. మరిన్ని మౌలిక వసతులకు రూ.5 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మంత్రి టీజీ భరత్ కోరిక మేరకు ఇక్కడే పది ఎకరాల స్థలాన్ని ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఇస్తున్నామన్నారు. నగరంలో ఆక్రమణలకు గురైన పార్కు స్థలాలను కమిషనర్ ద్వారా విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

ఎంఎస్ఎంఈ కింద ఉద్యోగావకాశాలు: మంత్రి భరత్

ఎంఎస్ఎంఈ కింద యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. పరిశ్రమ ఏర్పాటు వల్ల కాలనీలో ఉండే వెయ్యి కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు. గృహ సముదాయంలో ఉన్న జంగిల్ క్లియరెన్సు ఆదివారం సాయంత్రానికి కల్లా పూర్తి చేసి వాటికి సంబంధించి ఫోటోల మంత్రి నారాయణకు పంపాలని ఆదేశించారు. త్వరలోనే కాంట్రాక్టర్లకు రూ.6 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాలను పట్టించుకోలేదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే విధంగా మంత్రి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతోముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడ్కో, 'కుడా' అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత



నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న క్షేత్రంలో చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి సోమవారం ఉదయం 5గంటల వరకు ఆలయ ద్వారాలు మూసివేయనున్నారు. అదేవిధంగా ఆలయంలోని అన్ని అర్జితసేవలు, పరోక్షసేవలు, స్వామి వారి కల్యాణోత్సవం పూర్తిగా నిలుపుదల చేస్తున్నామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. సాక్షిగణపతి, హటకేశ్వరం, పాలదార, పంచదార, శిఖరేశ్వరం, మొదలైన పరివార ఆలయాల ద్వారాలు కూడా మూసివేస్తున్నామని తెలిపారు. సోమవారం ఉదయం 5గంటలకు ఆలయ ద్వారాలను తెరచి ఆలయశుద్ధి, సంప్రోక్షణ జరిపించిన తరువాత స్వామి అమ్మవార్ల ప్రాతఃకాల పూజలు నిర్వహిస్తున్నామని అన్నారు. మహామంగళహారతి సమయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులందరికీ అలంకార దర్శనం, సోమవారం సాయంత్రం 4గంటల స్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తామని తెలిపారు.

ఓంకార ఆలయం..

బండిఆత్మకూరు:నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకారం గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయం ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసి వేస్తున్నట్లు ఆలయ ఈవో నాగప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం దృష్ట్యా ఆదివారం 1 గంట నుంచి ఆలయాన్ని మూసివేయటం జరుగుతుందని, తిరిగి సోమవారం తెల్లవారు జామున ఆలయ సంప్రోక్షణ అనంతరం స్వామి వార్ల దర్శనం భక్తులకు కల్పిస్తామని ఈవో తెలిపారు.

ఘనంగా 5కే రన్

- ప్రారంభించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో
- కోల్స్ కాలేజీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగిన పరుగు

6

యువకుడి దారుణ హత్య

7

తుంగభద్ర తీరం

సాహిత్యం



సామాజిక స్పృహకు ప్రతిబింబం

కవితా(వి)హారం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అనేక రుగ్మతలపై స్పందిస్తూ.. పాఠకుల్లో సామాజిక చైతన్య స్పృహను మేల్కొలిపేలా నిలుస్తుంది 'కవితా(వి)హారం కవితా సంకలనం. 'పొత్తపు పొత్తిళ్లలో తానొక అక్షరమై అన్నట్లు..' రచయిత క్రిష్టిపాటి పట్టాభిరామ శర్మ ఈ పుస్తకాన్ని వెలువరించారు. జిల్లాలోని పంచాయతీ రాజ్ శాఖలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఈయనకు తెలుగు భాషపై ఉన్న అభిమానం సామాన్యమైనది కాదు. అది ఎంత ఉన్నత స్థాయిలో ఉందో ఈయన కవితా(వి) హారంలో అవగత మవుతుంది. మాతృ భాషపై శర్మకు ఉన్న అభిమానం, తెలుగు పదజాలం పైన ఉన్న గట్టిపట్టు, ఈకవితా సంకలనంలో ప్రయోగించిన అద్భుత పద ప్రయోగాలు వ్యక్తం చేస్తాయి. అంత్య ప్రాసలు, ఆంగ్ల పదాలకు సరైన తెలుగు అనువాద పదాలు, దీర్ఘ సమాస పదబంధాలు, వినూత్న పదవైచిత్రాలు చూస్తే అర్థమవుతుంది. 'పనిమొగ్గల కాల రాచు పాషాణుల దుశ్చేష్ట/ పడగ విప్పిన పాశవికతకు పరాకాష్ట' అంటూ సాగే కవితా పంక్తుల్లో ప్రాస పదాలు కవితను పరిపుష్టం చేస్తాయి. 'అంకురార్పణ' అనే కవితలో పర్యావరణ పరిరక్షణ కోసం తపించే ప్రకృతి ప్రేమికుడిగా సామాజిక సందేశాన్ని ప్రబోధిస్తూ, 'తరు మేధాన్నవుదాం' అనడంలో, నరమేధ వలె తరుమేధ సైతం అత్యంత ప్రమాదకర మన్న విషయాన్ని సూచించారు. పక్షిజాతులు అంతరించిపోవ డానికి కారణమైన సెల్‌ఫోన్స్ టవర్ల గురించి ప్రస్తావించే సందర్భంలో 'చరవాణి స్థూప ధాటికి' అనడం, ఆసిడ్ దాడుల ప్రస్తావనలో ఆమ్లీకృతమొనర్చడం అనడం, ధనాన్ని 'కక్షలు, కార్పణ్యాలు రగిలించే భాస్వరం'తో పోల్చడం వినూత్నంగా అనిపిస్తాయి. పుస్తక రచయిత శర్మ తన ప్రతి కవితలోనూ భావ ప్రకటనా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, తెలుగు భాషపై తనకున్న పట్టును రుజువు చేసుకోవడంలో సఫలీకృతులయ్యారు. 'చరవాణిని కరతల పేటికగా వర్ణిస్తూ రాసిన కవితలో 'అరచేత వైకుంఠమును చూపు మాయల మరాఠీ' అని చమత్కరించడం ఆకట్టుకుంటుంది. రచయిత కవితల్లో వృద్ధాప్యంలో అనాథలవుతున్న తల్లిదండ్రులు, అరాచకా లకు బలవుతున్న స్త్రీలు, సైనికులు, రైతులు ప్రధాన భూమికను పోషించారు. ఆధునిక భారతదేశ సామాజిక పరిస్థితులపై కలత చెందుతూ, ఆయా సందర్భాలను నిష్కర్షగా విమర్శిస్తూ నిరసన వెలిబుచ్చారు. మాతృభాష పరిరక్షణకై అన్న కవితలో మాతృభాష వర్ధించే విధానం మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితా పంక్తులను తలపింపజేస్తుంది. తెలుగు కనుమరుగు కాకుండా ఉండాలంటే 'పానుగంటి వారి సాక్షి సంపుటాలు పడగ విప్పాల్సిందే, అడుగడుగునా జంఘాల శాస్త్రులు పంజా విసరాల్సిందే' అంటూ ముక్తియించారు. మానవ దేహాన్ని 'జ్ఞాన కర్మేంద్రియ షట్చక్ర సహిత రక్తమాంస సమ్మిశ్రిత శల్య మల భవన భగవత్ ప్రసాదిత దేహం'గా అభివర్ణించడం అబ్బురపరుస్తుంది. వృత్తికి సంబంధం లేని ప్రవృత్తిని ఎంపిక చేసుకుని శర్మ చేస్తున్న అవిరళ సాహిత్య కృషి అభినందనీయం. శ్రీకన్యకా పరమేశ్వరి దేవి చరిత్ర, శ్రీవారి బ్రహ్మోత్సవ రూపకాలు, తుంగభద్ర పుష్కర గీతము అనే మూడు పుస్తకాలు ముద్రించిన శర్మ నాలుగో పుస్తకంగా 'కవితా(వి)హారము పాఠకులకు అందించారు. రచయిత శర్మ కలం నిరంతర కవన సృజన చేస్తూ, మరెన్నో కవితా సుమాలను విరబూయిం చాలని, తెలుగుతల్లి సిగలో అలంకరించాలని మనఃస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను. ఈ పుస్తకం ఆదివారం కర్నూలులో వెంకటరమణ కాలనీ సాయిరాఘవ రెసిడెన్సీలో ఆవిష్కరిస్తున్నారు. త్వరలో అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో అందుబాటులోకి రానుంది.



● కర్నాటి చంద్రమౌళిని, రచయిత్రి, కర్నూలు

కందనవోలు సాహిత్యంపై భాస్కర ముద్రికలు



ప్రింటింగ్‌లో ప్రూఫ్స్ సరిచూసుకుంటున్న భాస్కర్

- వందలాది పుస్తకాల ప్రచురణకు ప్రోత్సాహకాలు
- బహుముఖ రూపాల్లో రాణిస్తున్న ముద్రణా సంస్థ అధినేత
- కార్టూనిస్టు నుంచీ సాహితీ సంస్థ వ్యవస్థాపకుడిగా గుర్తింపు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సాహిత్యరంగంతో ఆయనకు ఎనలేని అనుబంధం ఉంది. ఒకటి కాదు, రెండు కాదు...సుమారు రెండున్నర దశాబ్దాలకు పైగా ఆబంధం కొనసాగుతోంది. ఔత్సాహిక రచయితలు, కవులు తాము రాసిన సాహిత్యాన్ని పుస్తక రూపంలో భద్రపరచుకోవాలంటే వెంటనే గుర్తొచ్చే పేరు ఆయనది. జిల్లాలో ఎందరో సాహితీవేత్తల పుస్తకాలు ఆయన ముద్రణా యంత్రం ద్వారానే వెలుగు చూశాయి. అనేక పుస్తకాలను ఆయన ప్రూఫ్‌లు (తప్పొప్పులు సరిదిద్దడం) చేసి అందమైన పుస్తక రూపాల్లో బయట ప్రపంచానికి అందించారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య నలిగిపోయే అనేక మందికి కూడా ఆయన ఏమీ ఆశించకుండా వారి పుస్తకాలను వెలుగు బాట పట్టించారు. ఆయనే కర్నూలుకు చెందిన పోలూరు విజయ భాస్కర్.. అలియాస్ ముద్రిక భాస్కర్. ఇంటి పేరు కన్నా, ముద్రిక అనే ప్రింటింగ్ ప్రెస్ పేరుతో ఆయన జిల్లా సాహిత్యరంగానికి సుపరిచితులు. డిగ్రీ చదివాక తెలుగు భాషపై మమకారం, రచనా వ్యాసంగం పట్ల ఆసక్తి, పుస్తకాల ప్రచురణలపై అభిరుచి, సుప్రసిద్ధ సాహితీమూర్తులతో ఉన్న అనుబంధం ఆయన్ను సాహిత్య రంగంపై ఎదిగేలా చేశాయి. 1980 దశకంలోనే జిల్లాలో తొలి రాజకీయ కార్టూనిస్టుగా వినతికెక్కిన ఆయన తర్వాత ఇన్‌టాక్ట్ సంస్థలో జిల్లా కన్వీనర్‌గా జిల్లాలోని అనేక చారిత్రక ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావడంలో కృషి చేశారు.

ఇంటి పేరు కన్నా, ముద్రిక అనే ప్రింటింగ్ ప్రెస్ పేరుతో ఆయన జిల్లా సాహిత్యరంగానికి సుపరిచితులు. తెలుగు భాషపై మమకారం, రచనా వ్యాసంగం పట్ల ఆసక్తి, పుస్తకాల ప్రచురణలపై అభిరుచి, సుప్రసిద్ధ సాహితీమూర్తులతో ఉన్న అనుబంధం ఆయన్ను సాహిత్య రంగంపై ఎదిగేలా చేశాయి. ఒకటి కాదు, రెండు కాదు.. సుమారు రెండున్నర దశాబ్దాలకు పైగా ఆబంధం కొనసాగుతోంది. ఔత్సాహిక రచయితలు, కవులు తాము రాసిన సాహిత్యాన్ని పుస్తక రూపంలో భద్రపరచుకోవాలంటే వెంటనే గుర్తొచ్చే పేరు ఆయనది. కర్నూలుకు చెందిన పోలూరు విజయ భాస్కర్.. అలియాస్ ముద్రిక భాస్కర్.

బాల్యం, విద్యాభ్యాసం..

ఉమ్మడి జిల్లాలోని నంద్యాల పట్టణంలోగల నూనెపల్లెకి చెందిన పోలూరు ఈశ్వరమ్మ, కొండయ్య దంపతులకు ఏకైక కుమారుడిగా భాస్కర్ జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య నంద్యాలలోనే జరిగింది. తండ్రి వృత్తిరీత్యా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉద్యోగి కావడంతో చదువు కూడా వివిధ ప్రాంతాల్లో కొనసాగింది. హైదరాబాదులో పది వరకు చదువుకున్న భాస్కర్ 1974లో పది పాసయ్యాక ఇంటర్ కర్నూలు ప్రభుత్వ జూనియర్ కళా శాల్లో చదువుకోవాల్సి వచ్చింది. ఇంటర్ పూర్తయ్యాక బీకాం ఉస్మానియా కళాశాల్లో చదువుతుండగా, తిరిగి తండ్రికి శ్రీకాళహస్తికి బదిలీ కావడంతో డిగ్రీ అక్కడ చదువుకున్నారు. డిగ్రీ పూర్తయ్యాక తిరుపతిలో ఎంఏ చేరారు.

చిత్తూరులో ప్రముఖ రచయితలతో..

తండ్రి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తుండగా, అక్కడే ప్రముఖ రచయి తలతో సాంగత్యం ఏర్పడింది. ముఖ్యంగా చిత్తూరు సెంట్రల్ లైబ్రరీలో జరిగే సాహిత్య సమావేశాలకు మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, ఎస్ మునిసుందరం వంటి ప్రముఖులు తరచూ విచ్చేసేవారు. ఎస్ మునిసుందరంతో మంచి పరిచయం ఏర్పడింది. అదే సమయంలో పత్రికల్లో చిత్రకారుడిగా చందమామ పత్రికకు ప్రయత్నించారు.



కర్నూలు ఇన్‌టాక్ట్ కోకన్వీనర్‌గా కేతవరంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తూ..

జిల్లా చరిత్రపై పరిశోధనలు...

జిల్లా పురావస్తు చరిత్ర, పర్యాటక ప్రాంతాలపై ఆసక్తితో ఇన్‌టాక్ట్ సంస్థలో సభ్యుడిగా ఉంటూ జిల్లా కన్వీనర్ స్థాయికి ఎదిగారు. సహచర ఇన్‌టాక్ట్ మిత్రులతో జిల్లాలోని అనేక ప్రాంతాలను వెలుగులోకి తీసుకువచ్చారు. అలా కేతవరం గృహలను వెలుగులోకి తీసుకువచ్చిన బృందంలో ఒకరిగా ముద్రిక భాస్కర్ నిలిచిపోతారు. ఇన్‌టాక్ట్ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలను రూపొందించడంతోపాటూ రాయలవారి 500 పట్టాభిషేక మహోత్సవాన్ని పుస్తకరూపంలో ముద్రించారు. ఈ పుస్తక సంపాదక వర్గంలో ఒకరిగా భాస్కర్ సేవలు అందించారు.


సాహిత్యానికి పెద్దపీట..



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న భాస్కర్

సాహిత్య రంగంలో తనకుంటూ ఉన్న మమకారంతో అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1989 ఏప్రిల్ 4న శ్యామలతో వివాహం జరిగింది. తన కుమార్తె ముద్రిక పేరుతో, భార్య ప్రోత్సాహంతో 1991లో ముద్రిక ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించారు. అంతకు ముందు సుమారు పదేళ్లు క్వాలిటీ ప్రింటర్స్ ప్రెస్‌లో పనిచేసిన అనుభవంతో ముద్రణా రంగంలో ముందుకు పోయారు. స్వతహాగా సాహిత్యాభిలాషి అయిన భాస్కర్ జిల్లాకు చెందిన అనేక మంది రచయితలు, కవుల పుస్తకాలను వెలుగులోకి తీసుకు వచ్చారు. కొందరికి ఉచితంగానే పుస్తకాలను ముద్రించి వారు పేరు, గుర్తింపు తెచ్చుకునేలా వెన్నంటి నిలిచారు. స్వయంగా ముద్రిక కళా స్రవంతి సాహిత్య సంస్థను నెలకొల్పి, అనేక మంది కవులు, రచయితలను వేదిక కల్పించారు. తెరచాటున ఉన్న సాహితీవేత్తలకు వేదిక కల్పించి వారికి సన్మాన సత్కారాలతో తగిన గుర్తింపు తీసుకువస్తున్నారు. జిల్లా సాహితీ చరిత్రను భావి తరాలకు అందించడమే తన లక్ష్యంగా ముద్రిక భాస్కర్ చెబుతున్నారు. చరిత్ర అధ్యయనానికి పుస్తకాలే నిజమైన అక్షర రూపాలని ఆయన అంటున్నారు.

తొలి రాజకీయ కార్టూనిస్టుగా రాణింపు..



తండ్రి పదవీవిరమణ అనంతరం కర్నూలుకు చేరుకున్న ముద్రిక భాస్కర్ కార్టూనిస్టుగా వందలాది కార్టూన్లు గీశారు. 1980 దశకంలో ఓ ప్రముఖ పత్రికకు రాజకీయ కార్టూనిస్టుగా భాస్కర్ నిత్యం కార్టూన్లు వేశారు. సుమారు పది సంవత్సరాల్లో వేలాది కార్టూన్లు వేశారు. అవి వివిధ పత్రికల్లోనూ ప్రత్యేక గుర్తింపు పొందాయి.

11న కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడు డైట్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు 11 అంశాల్లో నిర్వహించబడుతాయని డైట్ ప్రిన్సిపాల్ అయూబ్ హుశేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ విద్యాలయ, నవోదయ, రెసిడెన్షియల్‌తో పాటు మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. సంగీతం, నృత్యం, నటన, చిత్రకళ వంటి 11అంశాల్లో పోటీలు నిర్వహించబడుతాయని పేర్కొ న్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 8వ తేదీన సాయంత్రం లోపు కళాశాల అధ్యాపకులు వి.మాధురిని 8801761409ను సంప్రదించి పోటీకి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు తమ ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే శిక్షణ పొంది ఉండాలని, మేకప్, ఇతర సామగ్రిని వెంట తెచ్చుకోవాలని కోరారు.

ఘనంగా 5కే రన్

- ప్రారంభించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో
- కోల్స్ కాలేజీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగిన పరుగు



విజేతలతో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, జిల్లా క్రీడాశాఖ అధికారి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా క్రీడాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మారథాన్ 5కే రన్ పోటీలు శనివారం కోల్స్ కాలేజీ వద్ద ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ప్రారంభించారు. ఈ పరుగు పోటీల్లో జిల్లాలోని వివిధ కాలేజీలకు చెందిన 58 మంది విద్యార్థినులు, 55 మంది విద్యార్థులు, 5 మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు. ఈ పోటీలు కోల్స్ కాలేజీ నుంచి పార్కు రోడ్డు, రాజ్‌విహార్, కర్నూలు మెడికల్ కాలేజీ, సీ.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగింది. మొదటి విజేత బహుమతి టీ.నాగ శ్రీనివాసులు రూ.10వేలు, రెండో విజేతగా సి.హరికృష్ణకు రూ.7వేలు, మహిళా విభాగంలో మొదటి విజేత మద్దూరు రేణుకకు రూ.10వేలు, రెండో బహుమతి విజేత సీ.దేవికి రూ.7వేలు, ట్రాన్స్‌జెండర్ విభాగంలో మొదటి బహుమతి విజేత లీలా ప్రసాద్‌కు రూ.10వేలు, రెండో విజేత రక్షితకు రూ.7వేలు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ 5కే రన్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్, ఏపీ శాక్స్ ప్రోగ్రాం గణాంక అధికారి దేవి శంకర్‌గౌడు, జిల్లా క్రీడాశాఖ కోచ్‌లు వివిద కాలేజీ అధ్యాపకులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

ధర.. దగా!

5వ పేజీ తరువాయి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు ఆందోళన ఆపేది లేదంటూ భీష్మించారు. మార్కెట్‌లో అమ్మకాలు చేసిన వారం రోజుల్లోగా బోనస్ అమౌంట్ రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ బి.నవ్య స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



రైతులకు మద్దతు తెలుపుతున్న వైసీపీ నాయకులు

బోనస్ డబ్బు వచ్చేనా..?

ఉల్లి క్వింటాకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,200లు. మార్కెట్‌లో వ్యాపారులు క్వింటా రూ.500కు కొనుగోలు చేస్తే. మిగిలిన రూ.700లు వ్యత్యాసం అమౌంట్ బోనస్ రూపంలో ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు రాజు తెలిపారు. బోనస్ డబ్బు వస్తుందా..? రైతులను వేధిస్తున్న ప్రశ్న. 2018లో కూడా ఇలాగే ధరలు పతనమైతే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కనీసం మద్దతు ధర రూ.700 నిర్ణయించింది. మార్కెట్‌లో అంతకంటే తక్కువ ధర పలికితే ఆ బ్యాలెన్స్ అమౌంట్ బోనస్‌ ‌గా ఇచ్చింది. తొలి విడతగా రూ.25 లక్షలు రైతుల ఖాతాలో జమ చేశారు. రెండో విడతలో అమ్మకాలపై కర్నూలు మార్కెట్లో పంట విక్రయించిన రైతులు జాబితా సేకరించి రూ.6.25 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. 2019 ఎన్నికల కోడ్ రావడంతో నిధులు ఆగిపోయాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఆ దిశగా చర్యలు శూన్యం. దీంతో బోనస్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

క్వింటాలు రూ.250లకు కొనుగోలు చేశారు



రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి వచ్చింది. ఎకరం ఉల్లి పంట కోస్తే 130బస్తాలు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం క్వింటా రూ.1,200కు కొనుగోలు చేస్తున్నారని మార్కెట్‌కు తీసుకొస్తే, ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయలేదు. వ్యాపారులు క్వింటా రూ.250లకు కొనుగోలు చేశారు. ప్రభుత్వం మిగిలిన మొత్తం బోనస్ ఇస్తుందని అధికారులు తెలిపారు. ఎప్పుడు వస్తుందో తెలియదు.

● ఈరన్న, ఉల్లి రైతు, గువ్వలదొడ్డి గ్రామం, ఎమ్మిగనూరు మండలం

టమోటాది అదే పరిస్థితి

పత్తికొండ, ప్యాపిలి, బిల్లెకల్లు, ఆస్పరి టమోటా మార్కెట్‌లలో టమోటా దిగుబడులు అమ్మకాల కోసం రైతులు తీసుకొచ్చారు. ధరలు పతనం కావడంతో కిలో రూ.5-6లు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం పత్తికొండ మార్కెట్‌లో 40 కిలోలు టమోటా రూ.300లు కలిపింది. కొంత ఊపిరి పీల్చుకున్నారు. మెజార్టీగా కిలో రూ.5లోపే అమ్ముడుబోయిందని రైతులు పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన



తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలను నివారించేలా నాలుగు సబ్ డివిజన్‌ల్లో రోడ్డు ప్రమాదాలపై, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు, వాహనదారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. మహిళల పట్ల మార్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. వాహనానికి తగిన పత్రాలు అన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా లైసెన్స్ కల్గి ఉండాలన్నారు. పరిమితికి మించి వేగంగా వెళ్లరాదని, మద్యం సేవించిన అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మోటారు వాహన చట్టాలు అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశలు రేపుతున్న మిరప ధరలు



హాలహర్వి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిరప ధరలు పతనమైన వేళ నష్టాలలో కూరుకుపోతున్న అన్నదాతకు ప్రస్తుతం ధరలు రైతులకు ఆశలు రేకెత్తిస్తున్నాయి. గత ఏడాది పూర్తి స్థాయిలో ధర పతనం కావడంతో ఈ సంవత్సరం రైతులు మిరప సాగుపై చాలామంది రైతులు విముఖత చూపారు. ఆలూరు నియోజకవర్గంలో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువల కింద సాగు చేసుకున్న రైతులకు ప్రస్తుతం పెరిగిన ధరలు ఊరట ఇస్తున్నాయి. ధర లేక అమ్ముకోలేని రైతులు మార్కెట్‌లో అలాగే స్టాక్ ఉంచి వచ్చేశారు. ప్రస్తుతం తేజ రకం రూ.16 వేలు, సిజంటా రూ.20 వేలు, బ్యాడిగరకం రూ.25 వేలు ధరలు పెరగడంతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకున్న మిరపను రైతులు విక్రయిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నందికొట్కూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1975-76బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాలకు తమ వంతుగా ఆర్థిక సహాయంతో నిర్మించిన కళావేదికను ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువు ఫణిరావు ఆయన సతీమణిలకు పాదపూజ చేసి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కమలాకర్ రావు, పుండరీకాక్షాయ, మద్దూరు వెంకటరామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముజాహిద్‌పాష పాల్గొన్నారు.



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకా లిక సమస్యలు పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఈ ఎం.ఉమాపతికి వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు ర్యాలీలు, దీక్షలు, నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, ఎస్‌జీ.శంకర్, నాగేశులు, పీవీ.రామరాజు, రవికుమార్, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మద్దిలేటి (ఫైల్)

వెల్దుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. వివరాలు.. ఎస్.పేరాముల గ్రామానికి చెందిన ముంత మద్దిలేటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గతేడాది పత్తి, ఆముదం పంటలు వేసి తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ.6లక్షలు అప్పులు మిగిలాయి. నాలుగు నెలల క్రితమే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో కోలుకున్నాడు. తిరిగి వ్యవసాయం మీద నమ్మకంతో ఈసారి ఎనిమిది ఎకరాల్లో కంది పంట సాగుచేశాడు. దిగుబడులు రాని పరిస్థితి. అప్పుల వారి ఒత్తిడి పెరిగిపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఏమిచేయాలో దిక్కుతోచక కుటుంబసభ్యులు శుక్రవారం ఊరికి వెళ్లగా, రాత్రి ఇంట్లో దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ రైతు..

రుద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన రైతు జంగిటి నారాయణ (47) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం ఎస్‌ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. వివరాలిలా.. గ్రామానికి చెందిన నారాయణ రెండేళ్ల నుంచి తనకున్న ఐదెకరాల పొలం, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మినుము, వరి, మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంటలు దిగుబడి సరిగా లేక నష్టపోయాడు. పెట్టుబడి కూడా రాకపోవడంతో రూ.20లక్షలు అప్పులయ్యాయి. అప్పుల బాధ తాళలేక ఆగస్టు 28న రసాయన మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య లక్ష్మీదేవి చూసి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మంత్రాలయం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన బోయ ఉపేంద్ర (21) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపేంద్ర ఈ నెల 1వ తేదీన అందరూ పొలం పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయాలతో ఉన్న ఉపేంద్రను కుటుంబ సభ్యులు ఆదోని, కర్నూలు, ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఉపేంద్రకు తండ్రి ఈశ్వర్, తల్లి సుజాత ఉన్నారు. యువకుడి తండ్రి ఈశ్వర్ ఫిర్యాదు మేరకు మాధవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని అక్కడే పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- వ్యక్తి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

శిరివెళ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటన కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై కానాలపల్లె మెట్ట సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చిన్నపీరయ్య వివరాల ప్రకారం.. ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనడంతో మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన పీటర్ (46) అనే వ్యక్తి దుర్మరణం చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఓ వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన నంద్యాల పట్టణంలోని చోటు చేసుకున్నట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు. వివరాలు.. సాయిబాబా నగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు పోయే దారిలో ఉన్న ఒక అపార్టుమెంట్‌లో ఉంటున్న సుబ్బమ్మ(70) అనారోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ఐదేళ్ల క్రితం మోకాళ్లకు ఆపరేషన్ జరిగింది. ఇది జరిగిన కొంతకాలానికే మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో సైకాలజిస్టు వద్ద చికిత్స చేయిస్తున్నారు. శనివారం ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. అపార్టుమెంట్‌ను కూడా ఇటీవలే కొనుగోలు చేశారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. భర్త సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


గజ్జలి లింగన్న(ఫైల్)

కోసిగి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు రైలుకు కింద పడి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కర్ణాటక రాష్ట్రం రాయచూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన కురువ గజ్జలి నరసప్ప, ఈరమ్మ దంపతుల ఐదో కుమారుడు గజ్జలి లింగన్న(32). కర్ణాటకలోని మాన్వి తాలుకా, అరివి గ్రామానికి చెందిన నాగమ్మతో లింగన్నకు వివాహమైంది. భార్యతో కలిసి అతడు బేల్దార్ పని చేస్తూ బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. నెల క్రితం భార్య నాగమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఐదు రోజుల క్రితం లింగన్న భార్య ఊరికెళ్లి తన వెంట బెంగుళూరుకు రావాలని కోరాడు. ఇక్కడే పనిచేసుకుందామని భార్య చెప్పడంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో మనోవేదనకు గురైన లింగన్న శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో రాయచూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకంటే గంట ముందు తన అన్నలకు, కుటుంబానికి ఫోన్‌చేసి 'రేపు నా మట్టికి రావాలని.. అంతకంటే ఇంకేమీ మాట్లాడవద్దని, ఇదే చివరి మాటలు అని చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కర్ణాటక రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

కోడుమూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఓ మద్యం దుకాణం దగ్గర మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గిరి(23) అనే యువకుడి దారుణ హత్యకు గురయ్యాడు. వెంకటగిరికి చెందిన గిరి, మౌలాలి, ఉస్సేన్ అనే యువకులు మద్యం తాగేందుకు శనివారం సాయంత్రం మద్యం దుకాణానికి వెళ్లారు. అక్కడ మద్యం తీసుకొన్న వీరు వైన్స్ షాపు వెనక భాగంలో మద్యం తాగారు. తాగిన మైకంలో గిరితో మౌలాలి, ఉస్సేన్‌ల మధ్య మాటమాట పెరగడంతో వీరి మధ్య గొడవకు దారి తీసింది. ముందుగానే పథకం ప్రకారం తెచ్చు కొన్న కత్తితో గిరిపై దాడికి దిగి గొంతుకోయడంతో యుకువడు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఎస్‌ఐ డీవై స్వామి కేసే నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరి మధ్య పాత కక్షలు ఉన్నాయా? లేక ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

ఉల్లి రైతుల ఆత్మహత్యాయత్నం

- వైరల్‌గా మారిన సెల్ఫీ వీడియో


చికిత్స పొందుతున్న వెంకటనాయుడు, కృష్ణ

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో ఉల్లి రైతులు వెంకటనాయుడు, కృష్ణలు ఆత్మహత్యాయత్నం సెల్ఫీ వీడియో శనివారం వైరల్‌గా మారింది. ప్రస్తుతం వారు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. వెంకటనాయుడు రెండెకరాల్లో ఉల్లి పంట వేస్తే 96 బస్తాలు, కృష్ణ రెండున్నర ఎకరాల్లో ఉల్లి సాగు చేస్తే 110 బస్తాల దిగుబడి వచ్చింది. వీరిద్దరు కూడా స్వయాన అన్నదమ్ముల పిల్లలు. వీరు వైసీపీ కార్యకర్తలని స్థానికులు పేర్కొంటున్నారు. శుక్రవారం పొలంలోనే ధర లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియో తీసి అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. రాత్రి అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ సెల్ఫీ వీడియో శనివారం వైరల్ అయింది. అయితే కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్చేసేందుకే వైసీపీ నాయకులు కుట్రలో భాగంగా ఈ డ్రామాకు తెర తీశారనీ టీడీపీ ఆరోపిస్తోంది. దీనిపై విచారణ చేస్తున్నామని సి.బెళగల్ ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారులు మదన్ మోహన్, శశికాంత్ రైతుల ఉల్లి పంటను పరిశీలించారు. వెంకటనాయుడు భార్య రంగమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వెంకటనాయుడు, కృష్ణను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి పరామర్శించారు.

ప్రభుత్వంపై వైసీపీ కుట్ర

- రైతుల కష్టాల పేరిట ఆత్మహత్యాయత్నం డ్రామా
- పోలకల్లు ఘటనపై 'ఎక్స్' వేదికగా స్పందించిన టీడీపీ

కర్నూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలంలోని పోలకల్లు గ్రామంలో ఉల్లి రైతుల కష్టాల పేరిట వైసీపీ కార్యకర్తలు ఆత్మహత్యాయత్నం డ్రామాకు తెర తీశారని టీడీపీ ఆరోపిస్తోంది. శనివారం రాత్రి ఎక్స్ వేదికగా ఈ ప్రకటన చేసింది. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్చేసేం దుకు కుట్రల్లో భాగంగా అన్నదాత కష్టాల పేరుతో ఆత్మహత్యా యత్న డ్రామా ఆడుతున్నారని పేర్కొంది. ఉల్లి ధరలు తగ్గాయం టూ వైసీపీ కార్యకర్తలతో ఆ పార్టీ నాయకులే ఈ డ్రామా ఆడించారని పేర్కొన్నారు. పండించిన ఉల్లి పంటను అమ్మకానికి మార్కెట్ కు తీసుకురాకుండానే గిట్టుబాటు ధర లేక పురుగు మందు తాగి చనిపోతామంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేయడం ఆ పార్టీ నేతల దగాకోరు తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఖాళీ పురుగు మందు సీసాలో మద్యం కలుపుకుని ఆ మద్యాన్ని తాగి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సెల్ఫీ వీడియో తీశారనీ, ఈ సెల్ఫీ వీడియో డ్రామా ఆడిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన శనివారం వెలుగులోకి రావడంతో అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. దీని వెనుక ఎవరు ఉన్నారు?, వారి అసలు ఉద్దేశం ఏమిటీ అనేది అధికారులు పూర్తిగా ఆరా తీస్తున్నారని వివరించారు. ప్రస్తుతం వారికి ఎలాంటి అపాయం లేదని, ఎక్కువ మద్యం తీసుకోవడం వల్ల కొంత ఇబ్బందులు పడ్డారని డాక్టర్లు వివరించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో డైరెక్టర్‌గా పని చేసిన వైసీపీ నాయకుని అనుచరులుగా గుర్తించామని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆసుపత్రిలో ఉన్న ఫొటోలను అధికారులు విడుదల చేశారు.

గడ్డివామి దగ్ధం

- రైతును ఆదుకోవాలి: సీపీఐ


దగ్ధమైన గడ్డివామిని చూపుతున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాపురం గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటనలో రైతు గోర్లగుట్ట రామచంద్రుడికి రూ. 3లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రామచంద్రుడి తన పశువుల కోసం గ్రామ సమీపంలో పశుగ్రాసాన్ని నిల్వ చేశాడు. అయితే శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సీపీఐ మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, అంబాపురం గ్రామ శాఖ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ బాధిత రైతును పరామర్శించారు.

బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సోమన్న, శ్రీరాములు, శంకర్, ప్రదీప్, బాలు, మధు, శ్రీమన్నారాయణ, రవి పాల్గొన్నారు.

పెచ్చులూడిన కార్యాలయం పైకప్పు

- ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం


మెట్లపై పడిన పెచ్చులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ భవనం పై అంతస్థు కప్పు శనివారం పెచ్చులూడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం సంభవించలేదు. భవనం నిర్మించి కేవలం 17 సంవత్సరాలు అయిందని అప్పుడే పైకప్పు పెచ్చులూడటంపై విమర్శలు వస్తున్నాయి. కాగా మున్సిపల్ సమావేశ భవనం కూడా మొదటి అంతస్థులోనే ఉంది. సమావేశాల సమయంలో పెచ్చులూడింటే ఎలా? అని సిబ్బంది ఆందళన చెందుతున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సీనియర్ రంగస్థల నటుడు వన్నెం బలరాం కన్నుమూత



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు, టీజీవీ కలాక్షేత్రం శాశ్వత సభ్యుడు వన్నెం బలరాం (72) శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. బుధవార పేట లోని నివాసంలో ఆయనకు ఆయాసం ఎక్కువ కావడంతో ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, మార్గమధ్యలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం వన్నెం బలరాం పార్థీవ దేహాన్ని పలువురు రంగస్థల కళాకారులు, టీజీవీ కల్చరల్ అకాడమీ సంస్థ సభ్యులు సందర్శించి నివాళి అర్పించారు. టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి మాట్లాడుతూ వన్నెం బలరాం మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు అని, తొలి నంది అవార్డు సాధిం చిన ఘనత ఆయనకు దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధరరెడ్డి, అకాడమీ ప్రధాన కార్యదర్శి టి. రాజశేఖర్‌రావు, కళాకారులు చిన్ని కృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, ఎంఆర్ రాధిక, పీజీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీజీవీ కళాక్షేత్రంలో వన్నెం బలరాంకు నివాళి...

వన్నెం బలరాం ఆకస్మిక మృతి దిగ్భ్రాంతి కలిగించిందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం సాయంత్రం టీజీవీ కళాక్షేత్రంలో బలరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ లలిత కళాసమితిలో సభ్యునిగా 'నరనారాయణ' నాటకంలో తొలిసారిగా 1998లో తొలి నంది అవార్డు అందుకున్న ఘనత వన్నెం బలరాంకు దక్కుతుందని శ్లాఘిం చారు. ఓ మనిషీ నీకు జోహర్లు అనే సాంఘిక నాటకంలో ఉత్తమ హాస్య నటుడిగా 2013లో మరో నంది అవార్డు తీసుకున్నాడని, రెండు నంది అవార్డులు తీసుకున్న ఆయన మహారథి కర్ణ, పుటుక్కు జరజర డుబుక్కు మే, ప్రియాంక, పులిస్వారీ వంటి నాటకాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. కళాక్షేత్రం ప్రతిని ధులు పి.రాజారత్నం, వాల్మీకి రాముడు, సంగా ఆంజనేయులు, జీవీ శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ మియా పాల్గొన్నారు.

కుక్కల దాడి.. ఐదుగురికి గాయాలు

అవుకు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో కుక్కలు దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. అవుకు మండలం కాశీపురం గ్రామంలోని శాంతయ్య, కళావతి, జగదీష్, సుంకేసుల గ్రామంలోని బుల్లబ్బాయి, సంజామల మండలం ఆకుమల్ల గ్రామంలో దస్తగిరిని కుక్కలు కరిచాయి.

వీరిని కుటుంబసభ్యులు చికిత్స కోసం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కళావతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

9న జిల్లా సీనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన నగరంలో జిల్లా సీనియర్ పురుషులు, మహిళల టెన్నికాయిట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రమణ తెలిపారు. ఎ.క్యాంపులోని జోహరాపురం రోడ్డులోని నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎంపికలో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం 9398401721ను సంప్రదించాలన్నారు.

వాహనం బోల్తా

- పదిమందికి గాయాలు


గాయపడిన భక్తులు


హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో బోల్తాపడిన జీపు

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలం దారిలోని ఓం నమోనారాయణ మలుపు వద్ద శనివారం వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పదిమందికి గాయాలయ్యాయి. కడప జిల్లా కొండూరు గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు దైవ దర్శనం కోసం అహోబిలం క్షేత్రానికి వచ్చారు. దిగువ అహోబిలంలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని ఎగువ అహోబిలం వెళ్తుండగా ఓం నమో నారాయణ మలుపు వద్ద వాహనం బోల్తా పడింది. దాంతో కొండూరు గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, షేక్ బాలంబి, షేక్ కమాల్‌బి, భరణి, వెంకటసుబ్బయ్యతో పాటు మరో ఐదు మందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రతాప్‌రెడ్డి, భరణిలను మెరుగైన చికిత్స కోసం కడప ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో ...

బేతంచెర్ల: జీపు ముందు టైర్ల రాడ్ విరగడంతో పొలంలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టగా ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బేతంచెర్ల, డోన్ రహదారిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కర్నూలు చెందిన ఐదుగురు జీపులో ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి స్వామిని దర్శించుకున్నారు. తిరిగి స్వప్రాంతానికి వెళ్తుండగా జీపు ముందు టైర్ల రాడ్డు విరిగింది. దాంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 జరగనున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టుల జరిగే పరీక్ష నేపథ్యంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు, 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జిరాక్స్,ఇంటర్నెట్ సెంటర్లను మూసి వేయాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కుటుంబ పరువు కోసమే హత్య

- వదినను చంపి మరిది అరెస్టు

నందికొట్కూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ పరువు కోసమే ఓ మరిది తన వదినను చంపినట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వివరాలు.. పగిడ్యాల మండలం గణపురంలో లోక్ నాయక్ నివసిస్తున్నాడు. వదిన సుగాలి నాగమ్మ కొన్ని రోజుల నుంచి రైతుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. కుటుంబ పరువు పోతుందని, ప్రవర్తన మార్చుకోవాలని లోక్‌నాయక్ చెప్పారు. కానీ ఆమెలో మార్పు రాలేదు. దీంతో ఈనెల 4వ తేదీన హత్యకు పథకం వేశాడు. ముందుగానే ఇనుప రాడ్డును తీసుకొని నాగమ్మ ఇంటికి వెళ్లాడు. ఆమెతో వాగ్వాదం చేశాడు. ఫిర్యాదుదారుడు చంద్రనాయక్ లోక్‌నాయక్‌ను వారించేలోపే ఆమెను ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టాడు. దీంతో నాగమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. సుగాలి లోకనాయక్‌పై ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో చంద్రనాయక్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శనివారం తూర్పు ప్రాతకోట గ్రామంలోని కాటమయ్య స్వామి గుడి వద్ద లోక్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపి రాడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

పాణ్యం, సెప్టెంబరు 6 : (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి మరింత కృషి చేస్తున్నట్లు పాణ్యం అసెంబ్లీ ఆ పార్టీ ఇన్‌చార్జి పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కృష్ణాలయంలో ఏర్పాటు చేసిన పాణ్యం బీజేపీ అసెంబ్లీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపి అతిపెద్ద పార్టీ అన్నారు. ఎంతో ప్రణాళికతో నిబద్ధతతో పని చేస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో బలోపేతం లేకపోవడానికి పలు కారణాలు ఉన్నాయన్నారు. పాణ్యం బస్టాండు నుంచి టౌను వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామమద్దిలేటిరెడ్డి, గీతామాధురి, కెపి మద్దిలేటి, సీతమ్మ పాణ్యం అసెంబ్లీ కన్వీనర్ రామస్వామి పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికే 'మనస్విని'



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బండి ఆత్మకూరు, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే మనస్విని కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని ఎస్ఐ జగన్మోహన్, డీటీ గురునాథం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి అన్నారు. శనివారం బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళ సమస్యల పరిష్కార వేదిక డెస్క్ వద్ద మనస్విని వాల్‌పోస్టర్‌ను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ, భార్యాభర్తల సమస్యలు పరిష్కారం, ముందస్తు వివాహాల నివారణ తదితర అంశాల ప్రాతిపదికన మనస్విని వేదిక ఏర్పాటు చేయటం జరిగిందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోస్పాడు: గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు, హింసకు గురైనవారిని అండగా ఉండేందుకు జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రభుత్వం ప్రారంభిస్తోందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం గోస్పాడులో ఎంఎంఎస్ కార్యాలయంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు రమాదేవి, కోశాధికారి కిరణ్మయి, ఎంపీడీవో అమానుల్లా, ఏపీఎం శ్రీనివాసులు, డీపీఎం పుణ్యవతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి వరం



చెక్కును అంజేస్తున్న ఎన్ఎండీ ఫయాజ్

గోస్పాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని టీడీపీ రాష్ట్ర యువనాయకుడు ఎన్ఎండి ఫయాజ్ అన్నారు. మండలంలోని పసురపాడు గ్రామానికి చెందిన ఈడ లింగమయ్య కిడ్నీ సమస్యలతో ఇబ్బందులుపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు రూ. 50వేల చెక్కు మంజూరు కావడంతో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు భూమా ఉసేని, ఈడ రమేష్, ఈడ భాస్కర్ పాల్గొన్నారు.

జ్వరాల నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఆర్.వెంకటరమణ ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి పి.చంద్రశేఖర్‌రావు, అసిస్టెంట్ మలేరియా అధికారి కె.సత్యనారాయణతోకలిసి నంద్యాల జిల్లా మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధిచెంది మలేరియా, డెంగ్యూ, మెదడవాపు, ఫైలేరియావంటి జ్వరాలు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించి ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని 7సబ్ యూనిట్ల పరిధిలోని మలేరియా అధికారులు పాల్గొన్నారు.

మహానంది: నల్లమల అటవీ సమీపంలో నివసించే చెంచులు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి తెలిపారు. శనివారం మహానంది సమీపంలోని నల్లమల చెంచులక్ష్మి గూడెంలో సిబ్బంది చెంచులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన



నృత్య పోటీలను ప్రారంభిస్తున్న రామచంద్రారావు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాలులో శనివారం శాస్త్రీయ, జానపద, సోలో, బృంద నృత్యాలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రారావు ప్రారంభించారు. విజయవాడకు చెందిన శ్రీమన్నారాయణ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల, ఆదోని, కర్నూలు, అనంతపూర్, తదితర ప్రాంతాలనుంచి బాలల సాంప్రదాయ శాస్త్రీయ, నృత్య దుస్తులతో కూచిపూడి, భరతనాట్యం రీతులలో చక్కటి హావభావాలతో, ముద్రలతో నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళారాధన ప్రధానకార్యదర్శి డాక్టర్ రవిక్రిష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి రవిప్రకాష్, కార్యాలయ కార్యదర్శులు మధు, వెంకటేశ్వర్లు, సూర్య, ఇస్మాయిల్ పర్యవేక్షించారు.

క్లస్టర్ మ్యాపింగ్ విధానంతో అధిక పనిభారం

నందికొట్కూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ మ్యాపింగ్, మన మిత్ర, డోర్ టూ డోర్ సర్వే విధానాల వల్ల వార్డు సచివాలయ సిబ్బందిపై అధిక పనిభారం పడుతుందని శనివారం నందికొట్కూరులో సచివాలయ ఉద్యోగులు నిరసన చేపట్టారు. అధికారులకు వినతి పత్రాల ద్వారా అందజేసిన ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు శనివారం వార్డు సచివాలయ ఉద్యోగులు బ్లాక్ బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ బేబీకి అందజేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఉద్యోగులు తెలిపారు.



గోస్పాడులో యూరియాను పరిశీలిస్తున్న అధికారులు



వెలుగోడులో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు



పాములపాడు:ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పారదర్శకంగా యూరియా పంపిణీ

గోస్పాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజకీయాల కతీతంగా పంటవేసిన ప్రతి రైతుకు యూరియాను కలెక్టర్ రాజకుమారి ఆదేశాలమేరకు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, ఏవో స్వప్నిక తెలిపారు. శుక్ర, శనివారాల్లో యాళ్లూరులో 24టన్నులు, పసురపాడులో 22టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. శనివారం పసురపాడు ఆర్ఎస్‌కేలో 225మంది రైతులకు 496 బస్తాల యూరియాను పంపిణీచేసినట్లు అధికారులు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతును వరుసలో నిలబెట్టి యూరియా పంపిణీ చేయించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జూపాడుబంగ్లా: ప్రతి రైతుకు యూరియా అందించాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి అధికారులను ఆదేశించారు. మండలంలోని తాటిపాడు, 80బన్నూరు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రైతులు అందిస్తున్న యూరియా పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ప్రతిరైతుకు రెండు బస్తాల చొప్పున అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎస్ఐ మల్లికార్జున, ఉపతహసీల్దార్ నాగన్న పాల్గొన్నారు.

● యూరియా ప్రతి రైతుకు అందజేస్తున్నామని మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి అన్నారు. సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు యూరియా అందజేస్తున్నామని ప్రకటనలకే తప్ప చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు ఒక బస్తాకూడా ఇవ్వడంలేదని ప్రశ్నించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రతిరైతుకు యూరియా అందజేయాలనే ఉద్దేశంతో రైతుసేవా కేంద్రాల్లో గ్రామాల వారీగా అందజేస్తున్నామని అన్నారు. ఏవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందజేసే పిచికారీచేసే డ్రోన్, రోటవేటర్‌లను రైతులు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీ వో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, వైద్యాధికారులు మౌనిక, గంగాధర్, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, పీఆర్ఏఈ బషీర్, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ నాగేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై వ్యవసాయాధికారులు దృష్టి సారించి యూరియా కొరతను అరికట్టాలని జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ బాలరాజు, స్రవంతిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో అమీరున్నీసా భేగంకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహానంది: ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద అందజేసే యూరియాను వ్యవసాయ సిబ్బంది సక్రమంగా పంపిణీ చేయాలని మండల తహసీల్దార్ రమాదేవి తెలిపారు. శనివారం మహానంది మండలం తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ సిబ్బంది పంపిణీ చేస్తున్న యూరియాను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికార్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, వీఆర్వో సురేంద్రారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలో శనివారం మోతుకూరు, గుంతకందాల, రేగడగూడూరు గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలతో పాటు వెలుగోడు లోని విమల, ధనలక్ష్మి, శ్రీనివాస, సాయిలక్ష్మి ప్రైవేటు దుకాణాల్లో ఎరువుల పంపిణీ కొనసాగింది. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పోలీస్, వ్యవసాయ, రెవెన్యూశాఖ ల అధికారులు దగ్గర ఉండి ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

పాములపాడు: గత రెండు రోజులుగా మండలంలో వివిధ గ్రామాలలోని రైతుసేవా కేంద్రాల ద్వార రైతులకు యూరియా పంపిణీ చేశారు. శనివారం మండలంలోని వేంపెంట, మిట్టకందాల గ్రామాలలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

యూరియా కొరత తీర్చని ప్రభుత్వం: వైసీపీ



మాట్లాడుతున్న సద్దల సూర్యనారాయణ రెడ్డి

పాణ్యం: రైతులకు కూటమి ప్రభుత్వం యూరియా అందించడంలో విఫలమైందని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు సద్దల సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు. శనివారం వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా కొరతను టీడీపీ నాయకులే సృష్టిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు యూరియా ఎక్కువ వాడితే క్యాన్సర్ వస్తుందని పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. కొరతను తీర్చలేక ఇటువంటి హితబోధలు మాట్లాడడం 40 ఏళ్ల రాజకీయ అనుభవమున్న సీఎంకు తగదన్నారు. రాష్ట్రంలో వరి సాగు ఎంత? కావలసిన యూరియా ఎంత?అన్నది ప్రభుత్వాధికారులకు తెలియదా అని ప్రశ్నించారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ యూరియా కొరత లేదన్నారు. యూరియా కొరతపై 9న వైసీపి జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, నాయకులు రామలక్ష్మయ్య, ప్రతాపరెడ్డి, బాబు, తొగర్చేడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చాంద్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరు కొత్త బస్టాండ్ నరసింహారెడ్డి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయులు



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

అమెరికా సుంకాలను వ్యతిరేకించండి

ఆత్మకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు రణధీర్, మాబాషా, రజాక్ అన్నారు. శనివారం అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తూ.. ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే అమెరికాకు ఎగుమతి అవుతున్నాయని అన్నారు. అయితే అమెరికా విధించిన భారీ సుంకాల వల్ల ఆక్వా రైతులు ఏటా సుమారు .2వేల కోట్ల డాలర్లు నష్టపోతున్నట్లు వివరించారు. అలాగే గార్మెంట్, టెక్స్‌టైల్స్ రంగాలు కూడా సంక్షోభంలో చిక్కుకునే ప్రమాదం ఉందని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రసూల్, యూసుఫ్, ఇబ్రహీం, మాలిక్, రామ్‌నాయక్, నాగేశ్వరరావు, వీరన్న, రమణ తదితరులు ఉన్నారు.

నంద్యాల రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శనివారం సాయిబాబానగర్‌లో సీపీఎం, సీపీఐ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు రమేష్‌కుమార్, రంగనాయుడు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతం ట్రంప్ ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ట్రంప్ విధానాల వల్ల మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్‌టైల్స్, గార్మెంట్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని అన్నారు. ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోవడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ నిర్ణయాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తోటమద్దులు, మహమ్మద్‌గౌస్, రామచంద్రుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు సుంకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాల్ని దెబ్బతీస్తున్న కేంద్రంలోని ప్రధాని మోడీ కిమ్మనకపోవడం బాధాకరమన్నారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ నరసింహారెడ్డి సర్కిల్లో -అమెరికా టారిఫ్‌ల పెంపుకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతిపై 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఉత్పత్తులపైన తీవ్ర ప్రభావం పడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లబరేషన్ పార్టీ జిల్లా తాలుకా నాయకులు చెరుకుచర్ల గాబ్రియల్, కాటిపోగు సామన్న, వేల్పుల ఏసన్న, నాగేశ్వరరావు, అరుణ్ కుమార్, సుంకన్న, లక్ష్మీదేవి, రోజమ్మ పాల్గొన్నారు.

స్వమిత్ర రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

● వాట్సాప్ గవర్నెన్సిపై అవగాహన కల్పించండి

● డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అన్వరా బేగం



ఎంపీడీవో, ఇతర అధికారులతో మాట్లాడుతున్న డీడీవో

నందికొట్కూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునికంగా తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్సిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డిడివో) అన్వరా బేగం అన్నారు. శనివారం డీడీవో నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మన మిత్ర క్యాంపెన్‌లో భాగంగా డోర్‌టూ డోర్ సర్వేను తనిఖీ చేసేందుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. స్వమిత్ర రీ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వేతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు సూచించిన కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు, దైవదర్శనాల కోసం స్లాట్ బుక్కింగ్, ఆర్టీసీలో టిక్కెట్ల బుక్కింగ్ చేసుకోవచ్చాన్నారు. పీజీఆర్ఎస్, పెన్షన్, అన్నదాతలకు వచ్చే అన్నదాత సుఖీభవ, తదితర అంశాలకు సంబంధించి వాట్సాప్‌లో (9552300009) దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్సి ద్వారా ఇప్పటికే 200 సేవలు అందుబాటులోకి వచ్చాయని, త్వరలోనే మరో 300 సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. వాట్సాప్ గవర్నెన్సీపై సచివాలయ ఉద్యోగులు ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయానికి స్థలాన్ని మంజూరు చేయండి



ఎమ్మెల్యే బుడ్డాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా స్థలాన్ని మంజూరు చేయాలని సొసైటీ చైర్మన్ షహబుద్దిన్, మేనేజర్ నాగేశ్వరరావు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని విన్నవించారు. శనివారం వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను విన్నవించారు. వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు సింగిల్ విండో సొసైటీ కార్యాలయానికి శా శ్వత భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లో కార్యాలయాన్ని నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తరుచూ సొసైటీ కార్యాలయానికి మార్చుట వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అదేక్రమంలో సొసైటీకి అనుసంధానంగా గోదాము నిర్మాణానికి కూడా స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం నంద్యాల టర్నింగ్‌లో సెరికల్చర్ డిపార్టుమెంట్‌కు చెందిన స్థలంలో తమ కార్యాలయ నిర్వహణకు 20సెంట్ల స్థలాన్ని ఇచ్చేవిధంగా చొరవ తీసుకోవాలని విన్నవించారు. వీరి వెంట టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు కలిముల్లా, సొసైటీ డైరెక్టర్ అమరం రమేష్, నాయకులు ఫక్రుద్దీన్ ఉన్నారు.

వాహనం విరాళం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంకు, శ్రీశైలం శాఖ వారు మహీంద్ర బోలెరా వాహనాన్ని శ్రీశైల దేవస్థానానికి విరాళంగా అందజేశారు. శనివారం గంగాధర మండపం వద్ద మహేంద్ర బొలెరోరా వాహనం, సంబంధిత పత్రాలను ఆబ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయసిబ్బంది, అర్చకులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ మంచాలు విరాళం



డబుల్ డెక్కర్ మంచాలను చూపుతున్న ఆవాస కమిటీ సభ్యులు

కొత్తపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం గోకవరం నుంచి సేవాభారతి భక్తకన్నప్ప గురుకులం చెంచు బాలుర ఆవసానికి రూ.2.10 లక్షల విలువ గల 15 డబుల్ డక్కర్ ఇనుప మంచాలను నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి విరాళంగా ఇచ్చినట్లు ఆవాస బృందం సభ్యులు రామకృష్ణ తెలిపారు. 5వ తేదీన గురుపూజోత్సవంలో మాండ్ర పాల్గొని విద్యార్థులు పడుతున్న ఇబ్బందులును ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో మంచాలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

జీతాల పెంపుపై హర్షం

ఆత్మకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలను పెంచడం పట్ల సీపీఐ నాయకులు ప్రతాప్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దొరస్వామి, నాగరాజు, రాజీవ్, సుధాకరరావు, శంకర్‌లు పేర్కొన్నారు. శనివారం కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్‌ను వారు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21వేల నుంచి రూ.26వేలకు వేతనాలు పెంచడంతో పాటు కొత్త యూనిఫామ్స్ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. అదేవిధంగా ఇచ్చిన మరిన్ని హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాబు, నరసింహులు, రాజు, విజయ్, చిన్ననందయ్య, నాగన్న, శేఖర్, ధానుమయ్య, రూతమ్మ, సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

మహానందీశ్వరుని సన్నిధిలో గోపాలపురం ఎమ్మెల్యే



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే వెంకటరాజు

మహానంది, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శనివారం తూర్పుగోదా వరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యే వెంకటరాజు ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయ ముఖ మంటపం వద్ద ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు అభిషేక పూజలను నిర్వహించారు. ఆలంకార మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించారు. ఏఈవో మధు శాల్వతో సన్మానించి, ప్రసాదాలను అందజేశారు.

అన్నదాన పథకానికి రూ.50వేల వితరణ

ఆత్మకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి సాయిబాబానగర్‌కు చెందిన రిటైర్డు ఉపాధ్యాయురాలు ఊర్మిళదేవీ రూ.50వేలు విరాళం అందజేశారు. విరాళ సొమ్మును శనివారం దేవస్థానం అన్నదాన కమిటీ వారికి అప్పగించారు.దాతలకు ఆలయ మర్యాదలతో స్వామివారి ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

మంత్రిని కలిసిన డైరెక్టర్ ఖలీల్ అహ్మద్



మంత్రిని మార్యాదపూర్వకంగా కలిసిన డైరెక్టర్ ఖలీల్ అహ్మద్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మంత్రి ఫరూక్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మానీయార్ ఖలీల్ అహ్మద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని గుర్తించి ముఖ్యమంత్రి ఇటీవల విడుదల చేసిన డైరెక్టర్ పేర్లల్లో తమ పేరు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాకు పదవి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యావాదాలు తెలిపారు.

సొసైటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న అంబటి వివేకానందరెడ్డి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. తనకు చైర్మన్ పదవి కేటాయించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. సొసైటీ పరిధిలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని అంబటి వివేకానందరెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీఈవో కేశవ, టీడీపీ ప్రచారకార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి రవిప్రకాష్‌రెడ్డి, కొండారెడ్డి, హర్ష, కల్వటాల చంద్రశేఖరరెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

సహకార సంఘానికి భవనం కేటాయించండి ..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనం కేటాయించాలని సొసైటీ చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి కోరారు. శనివారం ఎంపీడీవో ప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత కార్యాలయం శిథిలావస్థలో ఉందన్నారు. నూతన కార్యాలయం నిర్మాణం పూర్తయ్యేవరకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీఈవో కేశవ, నాయకులు ఉన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కొన్నిరోజులుగా విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి, ఈవో ప్రకాశ్‌నాయుడుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఖరీంబాషా, వడ్డెసుబ్బరాయుడు, ఓబులేసు, నరసింహ, నవీన్, రెడ్డిపల్లె ఓబయ్య, రాముడు, బాలు, మురళి, కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో న్యామతుల్ల ఆదేశించారు. శనివారం మండలంలోని శెట్టివీడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్ది విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

'మనస్విని' పోస్టర్ ఆవిష్కరణ

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మనస్విని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు మనస్విని కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతి శనివారం పోలీసుస్టేషన్‌లో కమిటీ సభ్యులు వివిధ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముందస్తు వివాహ, ఫ్యామిలీ, భార్యాభర్తల, చైల్డ్‌మ్యారేజ్‌లపై కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు ప్రసన్న, ఆశా పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, మూడురాళ్లపల్లె రహదారిలోగల అభయాంజనేయస్వాములకు శనివారం వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల జీర్ణోద్ధరణ పనుల కోసం కడప జిల్లా సాయిపేట గ్రామానికి చెందిన బి. ఆంజనేయులు, దేవకిదేవి దంపతులు రూ.2లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందించారు. అన్నదానంకు సహకరించిన రాజబాబు యాదవ్, లక్ష్మీదేవి దంపతులను కమిటీ సభ్యులు సన్మానించారు. చెన్నకేశవ, సంజీవరాయస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఆలయ అధికారి రామ్మోహన్, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

స్వమిత్ర సర్వే వేగవంతం

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వమిత్ర సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. శనివారం గొడిగనూరు గ్రామంలో జరుగుతున్న స్వమిత్ర సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోవాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చేతిలో ప్రభుత్వం వంటి మనమిత్ర సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. శనివారం కోటకందుకూరు లో సిబ్బందితో ఆమె ఇంటింటికి తిరిగి మన మిత్ర సేవలపై అవగాహన కల్పించారు.ప్రభుత్వ వాట్సాప్‌నంబర్ 9552300009ను ప్రతిఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆలయాల మూసివేత

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె, వెల్లాల క్షేత్రం, చాగలమర్రి చెన్నకేశవ, అయ్యప్ప, కన్యకాపరమేశ్వరి, పలు ఆలయాలు ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం కావడంతో ఆలయాలు మూసివేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు శనివారం తెలిపారు. సోమవారం ఆలయాల్లో సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

సర్వేలను వేగవంతం చేయండి

రుద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సర్వే పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం ఎర్రగుడిదిన్నె, చిలకలూరు, రుద్రవరంలోని 2, 3 సచివాలయాలను తనిఖీ చేశారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేశ్ తదితరులున్నారు.

క్లస్టర్ వ్యవస్థను ఎత్తివేయాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ వ్యవస్థను వెంటనే ఎత్తివేయాలని సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయం వద్ద భోజన విరామంలో సచివాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. సచివాలయ సంఘం నాయకుడు బాలస్వామి, వివిధ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి లిఖిత్‌రెడ్డి అన్నారు. శనివారం అహోబిలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుగుణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా వరి సాగు

- మండలంలో పెరుగుతున్న వరి విస్తీర్ణం
- వరినారు కోసం రైతుల ఇబ్బందులు
- కోవెలకుంట్లలోనూ ఇదే జోరు
- మహిళా కూలీలకు పెరిగిన డిమాండ్


వరి నాట్లు వేస్తున్న కూలీలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వరి సాగు జోరుగా సాగుతోంది. ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. గత రెండు మూడేళ్లుగా వరి సాగుకు దూరంగా ఉన్న రైతులు ఈయేడు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. ఆయా గ్రామాల్లో చెరువులు, బోరు బావుల కింద వరి విస్తారంగా సాగు చేస్తున్నారు. మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1085 ఎకరాలు కాగా, ప్రస్తుతం 3000ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అధికారి గణాంకాల ద్వారా తెలుస్తోంది. మూడింతల సాగు పెరిగినట్లయ్యింది. మరోవైపు గతంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు వరి నార ఏర్పాటు చేసుకోలేదు. నారు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, అవుకు, కోవెలకుంట్ల ప్రాంతాల నుంచి నార తెచ్చుకుంటున్నారు. ఇదే సమయంలో వరి సాగుకు ప్రధాన అవసరమైన యూరియా కొరత అన్నదాతలను తీవ్రంగా వేధిస్తోంది. యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఓవైపు అధికారులు వెల్లడిస్తున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరి నాట్లు జోరుగా సాగుతుండటంతో మహిళా కూలీలలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. కూలీల కొరతతో ఒక్క రోజు కూలి రూ.600, 700 వెచ్చించాల్సి వస్తోందని రైతు లు వాపోతున్నారు. మరోవైపు కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో కూడా వరి సాగు జోరుగా సాగుతోంది. డివిజన్‌లోని కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, అవుకు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలకు సంబంధించి వరి సాధారణ సాగు విస్తీర్ణం 23,782ఎకరాలు కాగా ఈఏడాది అంతకు మించి సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రామాల్లో జోరుగా సాగుతున్న వరి నాట్లుతో ఇటు రైతులు, అటు కూలీలు బీజీ బీజీగా ఉన్నారు. దీంతో పొలాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది.

సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం


నూతన సభ్యులను సన్మానించిన టీడీపీ నాయకులు

సంజామల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆకుమళ్ల సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని నూతన చైర్మన్ ఉప్పలూరి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆకుమళ్ల పీఏసీఎస్‌లో చైర్మన్‌గా మోహన్‌రెడ్డి, డైరెక్టర్లుగా నాగరాజు , చంద్రశేఖర్ రెడ్డి, మరో సభ్యుడితో సహకార సంఘాల డివిజినల్ అధికారి ప్రభాకర్ ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సహకార సంఘం పరిధిలోని అన్ని గ్రామాల రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతులకు ఇవ్వాల్సిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక , పంట రుణాలు , రాయితీలు అందజేసి అండగా ఉంటానన్నారు. సొసైటీని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పాలకవర్గాన్ని పలువురు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మంచాల మద్దిలేటి రెడ్డి పేరుసోమల సర్పంచ్ శివశంకర్ రెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, పరమేశ్వర రెడ్డి, నాగరాజు, సీఈవో పెద్దయ్య, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న కాలువ లైనింగ్

- పొలాల్లో నిలిచిన నీరు


రైతులు కాలువకు వేసిన ఇసుక సంచులు


మొక్కజొన్న పంటలో నిలిచిన నీరు

చాగలమర్రి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలో పాటు కాల్వ లైనింగ్ దెబ్బతినడంతో గురువారం రాత్రి నీరు పంట పొలాల్లో ప్రవహించింది. దీంతో రైతులు సాగు చేసుకున్న మొక్కజొన్న, మినుము తదితర పంటలు దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం వేసుకోవడానికి సిద్ధంగా ఉంచిన పొలాల్లో నీరు నిలువడంతో జొన్న విత్తనాలు వేసుకోవడానికి అవస్థలు పడ్డారు. గొట్లూరు గ్రామ సమీపంలోని కేసీ ప్రధాన కాలువ నుంచి గోపాయపల్లె, మల్లేవేముల గ్రామాలకు నీరు ప్రవహించే పంట కాలువ లైనింగ్ దెబ్బతినడంతో లీకేజీ నీరు పంట పొలాల్లో ప్రవహించి రైతులకు నష్టం వాటిల్లుతోంది. దెబ్బతిన్న పంట కాలువ వద్ద నీరు పొలాల్లో ప్రవహించకుండా రైతులే ఇసుక సంచులతో అడ్డుకట్టలు వేసుకున్నారు. కేసీ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయడంతో ప్రధాన కాలువ నుంచి పంట కాలువకు నీరు ప్రవహించకుండా నిలిపివేశారు. కాలువ లైనింగ్ మరమ్మతులు చేపట్టి నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

యువత రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్యాపిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీఐ వెంకటరామిరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ నాయకులను, రక్తదానం చేసిన ఉపాధ్యాయులను సీఐ సీఐ అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విజయ్‌కుమార్, సుబ్బుయాదవ్, నాగమతియాదవ్, పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాని స్పందించాలి: సీపీఎం



డోన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఉత్పత్తుల దిగుమతులకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలపై ప్రధాని స్పందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. శనివారం బేతంచెర్ల రోడ్డులో నిరసన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు పెంచడం దేశంలోనే ఉత్పత్తుల రంగంపై తీవ్ర ప్రభా వం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నక్కి హరి, షమీమ్ బేగం, రాజ్‌కుమార్, డీబీ ఖాజా హుశేన్ పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో రైతు సేవా కేంద్రంలో యూరియాను దించుతున్న హమాలీలు


ఉయ్యాలవాడలో యూరియాను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



బనగానపల్లెలో పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

రైతు సేవా కేంద్రాలకు చేరిన యూరియా

- పర్యవేక్షించిన మండల స్థాయి అధికారులు
- పోలీసు పహారాలో పంపిణీ

కొలిమిగుండ్ల/కోవెలకుంట్ల/చాగలమర్రి/రుద్రవరం/ప్యాపిలి/అవుకు/శిరివెళ్ల/బనగానపల్లె/ఉయ్యాలవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్ నియోజకవర్గాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు యూరియా చేరుకుంది. కొద్ది రోజులుగా జిల్లాలో యూరియా పంపిణీలో ఏర్పడుతున్న వివాదాల నేపథ్యంలో అధికారులు అత్యంత భద్రత చర్యలు తీసుకున్నారు. యూరియా కోసం రైతులు తరలివచ్చారు. పోలీసు పహారా మధ్య రైతులకు యూరియాను అందజేశారు. మండలస్థాయి అధికారులు, నాయకులు పర్యవేక్షించారు. రుద్రవరం మండలం పేరూరులో కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిరీక్షించాల్సి రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.


కొలిమిగుండ్లలో పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు


ప్యాపిలి: రాచెర్లలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు


అవుకులో..


రుద్రవరంలో..

చరణ్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి


ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనపకుంట గ్రామానికి చెందిన యువకుడు చరణ్ ఈతకు వెళ్లి మృతి చెందాడు. శనివారం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చరణ్ మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఓంప్రకాష్, కనపకుంట గోవిందరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీమ సుబ్బారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్యసమావేశం ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజు శనివారం తెలిపారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమ నివేదికలతో రావాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరు కానున్నారన్నారు.

బీరువా విరాళం

బేతంచెర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బీరువాను శనివారం విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఆర్యవైశ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కందగడ్డల జనార్దన్, అనుముల సుధీర్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

కోవెలకుంట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని బనగానపల్లె రోడ్డు సర్కిల్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు సర్టిఫికెట్లు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అతివేగంగా ఆటోను నడపరాదన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

డోన్ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యశోద ఆసుపత్రిలో ఆదివారం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గైనకాలజిస్టు డాక్టర్ సుంకన్న తెలిపారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గిరిజన సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోట రాముడు



డోన్ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డోన్‌కు చెందిన మోట రాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ గిరిజన సమైక్య రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. రాముడు ఎన్నికపై డోన్ సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా పేర్కొన్నారు. శనివారం మండలంలోని కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి, తాగునీటి సరఫరాను పరిశీలించారు. పైప్‌లైన్‌ల మరమ్మతులు, లీకేజీల విషయంలో పంచాయతీ కార్యదర్శులను, సర్పంచ్‌లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో కొలిమిగుండ్లకు చెందిన జడలమ్మగారి వెంకటేష్‌పై ఇదే గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు దాడి చేసినట్లు సీఐ రమేష్‌బాబు శనివారం వెల్లడించారు. వెంకటేష్ గత నెల 29న వినాయక నిమజ్జనం సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉండగా గ్రామానికి చెందిన బోయ రవికుమార్, శ్రీనివాసకుమార్ అడ్డగించి దాడి చేశారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.


అభయ భవితపై అవగాహన

బేతంచెర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ధరణి కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అభయ భవితపై అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ బాలచంద్రన్ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలచంద్రన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు దిశా నిర్దేశాలను సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

డోన్ టౌన్, సెప్టెంబ రు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని హెచ్‌ఎం జే. సురేష్ బెనర్జీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఇ.షణ్మార్తి ముఖ్య అతిథిగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళ కుమారి, మాలతీలత, పి.అల్లి పీర, కే.గోపాల్, భాస్కర్ రెడ్డి, రజాక్, శ్రీరాములు, నరసింహులు పాల్గొన్నారు.

మహాలయ పౌర్ణమికి పొట్టేళ్లకు భలే గిరాకీ



బేతంచెర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహాలయ పౌర్ణమి పురస్కరించుకుని శనివారం పట్టణంలో పాతబస్టాండులో పొట్టేళ్ల విక్రయాలకు గిరాకీ పెరిగింది. ఒక పొట్టేలు రూ. 11,500లు, జత రూ.23,500లు ధర పలికింది. పొట్టేళ్లను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. కొందరు ధరలను చూసి వెనుదిగారు.

వాసాపురంలో గణేశుడి లడ్డూ వేలం

- రూ.50వేలకు కైవసం చేసుకున్న ప్రకాశం జిల్లా వాసి



రుద్రవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో కొలువు దీరిన వినాయకుడి లడ్డూను శనివారం వేలం వేశారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు వాసి పల్లె పుల్లారెడ్డి, పల్లె మహేశ్వరి దంపతులు రూ.50వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. నిర్వాహకులు పుల్లారెడ్డి దంపతులను సన్మానించారు. 11 రోజులు పూజించిన గణనాథుడిని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.